సమర్పణ

[కథానిక]

'అమరేంద్ర'

తాను ఒక్కత్తే మిగిలింది. తనకు నాలుగేళ్ల పసిమనమడు ఒక్కడే దక్కాడు. తక్కినవాళ్లంతా దారిలోనే మట్టిపాలయారు. కొడుకులూ కోడళ్లూ, కూతురూ అల్లుడూ అంతా తనను ఈ శూన్యలోకంలో ఏకాకిని చేసి వెళ్లిపోయారు. ఆకులన్నీ రాలి మోడయిపోయి భీకరంగా కనిపించే ఎండురాసిచెట్టులాగా తను ఒక్కత్తే మిగిలిపోయింది. కొమ్మల్లో ఏమూలనో చిగురించిన లేతచిగురులాగా పసిమనమడొక్కడే ముసలిమామ్మశూన్యహృదయంలో జీవితాశను రేకెత్తిస్తున్నాడు. ఈ మనమడికోసం కాకపోతే తను ఈపాటికే తన సంతానంతో కలిసి స్వర్గానికి చేరుకునేది. ఈ పసికందును దిక్కులేని పక్షిని చేసిపోవటానికి మనసు పుట్టకపోవటంవల్లనే తన మొండిఘటాన్ని ఈడ్చుకొంటూ ఇంతదూరం నడిచివచ్చింది. అడుగుతీసి అడుగువేసే ఓపికలేని వయస్సు. అధఃపాతాళానికి అణగదొక్కివేసే దుఃఖభారం. అన్నిటినీ దిగమింగి అనాథుల సమూహంలో కలిసి తనూ బయలుదేరింది. అన్నిటినీ ఎదిరించి రగిలే శోకంతో, మండే ఆకలితో గజగజ వణుకుతూ మొండిగా ముందుకు సాగుతోంది. తన పసిమనమడిని ప్రాణంకన్నా భద్రంగా కాపాడుకుంటూ దీనంగా, బరువుగా అడుగు వేస్తోంది. దారిలో నదులూ, కొండలూ, అడవులూ అడ్డంవచ్చినా ఆగలేదు. ఆకలీ, చలీ, శోకం, రోగం ఎన్ని అణగదొక్కినా కుంగిపోలేదు. మృత్యువునుకూడా జయించివేసే ఆశతో, సాహసంతో, పూనికతో ఆ ముసలి తన ముడతలుపడిన శరీరంతో, చూపుమందగించిన కళ్లతో మొండిగా ముందడుగు వేస్తోంది. ఇది అంతులేని ప్రయాణంలాగుంది. బయలుదేరి ఎన్నాళ్లయిందో! అసలు ఈయాత్రకు అంతం లేదేమోనని నిస్పృహ తోస్తోంది. ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని అడుగడుగునా మృత్యువుతో యుద్ధంచేస్తూ నరకంలో నడుస్తున్నట్లనిపిస్తోంది. అనుక్షణమూ హృదయంలో ఆ హాహాకారాలే ప్రతిధ్వనించి అణువణువూ ఆవేశంతో కంపించిపోతోంది. అహర్నిశలూ ఆ దారుణదృశ్యాలే కళ్లలో మెదలుతూ హృదయంలో ఆరనిచిచ్చు రగులుస్తున్నయ్. అవన్నీ తలపుకురాగానే ముసలమ్మ నిలువునా నీరుకారిపోతుంది. మరుక్షణంలోనే ఆమెముసలిహృదయం దెబ్బతిన్న తాచులాగా చర్రున త్రుళ్లిపడి బుసకొడుతుంది.

తను కాటికి కాళ్లు చాపిన ముసలి ననే సంగతి మరిచిపోయి ప్రచండమైన ఆవేశంతో కంపించిపోతోంది. తన బుజాల మీద కూచుని అమాయకంగా, జాలిగా చూసే పసిమనవడికేసి ఒకసారి చూస్తుంది. "బాబూ! నా ప్రాణం వుండగా నీకే ఆపదా రానివ్వను. నిన్ను సురక్షితంగా గమ్యస్థలానికి చేరుస్తాను. కంటికి రెప్పలాగా పెంచి పెద్దవాణ్ని చేస్తాను. పెద్దవాడివి కాగానే నువ్వు......" అని ఎన్నో ఆశలతో క్షణంలో ఆమె హృదయం వెయ్యి మెరుపులు మెరిసిన ఆకాశంలాగా వెలుగుతుంది. తన గుండెల్లో రగిలే చిచ్చు చల్లార్చే శక్తి ఆ పసికందులో వుందనే ఆమె విశ్వాసం. వాడు పెరిగి పెద్దవాడైతే తనను దహించివేసే ఈ శోకాగ్ని చల్లారుతుంది. ఈ పసివాడే తన ముసలి చేతుల్లో మిగిలిన ఆయుధం. వీణ్ని పదునుపెట్టి తన సంతతినంతనూ చిత్రవధ చేసిన శత్రువుల శరీరాన్ని చీల్చి చెండాడాలని ముసలమ్మ ఆశ. తనకు జరిగిన దురన్యాయానికి ప్రతీకారం జరపటంకోసమే ఈ పసికందును సురక్షితంగా గమ్యం చేరుస్తుంది. అందుకోసమే వాణ్ని పెంచి పెద్దవాణ్ణి చేస్తుంది. శత్రువులమీద పగను చల్లారనివ్వకుండా క్రోధాగ్నిని వాడి గుండెల్లో రగుల్చుతుంది. అప్పటికిగాని తన కడుపుమంట చల్లారదు. అప్పటికిగాని తన కూతురూ, కోడలూ తన కళ్లముందు మానభంగానికీ, చిత్రవధకూ గురి అయిపోతూంటే, హాహాకారాలు చేస్తూంటే శవంలాగా వింటూ నిలబడ్డ తనలో రేగిన చిచ్చు చల్లారదు. అప్పటికిగాని తన కొడుకులూ, అల్లుడూ జంతువులకన్న నీచమైన చావుకు గురి అయినప్పుడు తనలో ఎగసిన మంట చల్లారదు. ఈ మంట ఆరని బడబాగ్ని. ఇది చల్లారని దావానలం. దీన్ని చల్లారకుండా విసరటానికే ముసలమ్మ తన బడుగు దేహంలో అసువులు మిగుల్చుకుంది. ఈ ఆవేశంతోనే ఇంతదూరం నడిచి రాగలిగింది. ఈ ఉద్రేకంతోనే గుండెల్ని చీల్చుకువచ్చే ఆక్రోశాన్ని దిగమింగుకోగలిగింది.

"మామ్మా, ఇంకెంతదూరం?" అని అడిగాడు కుర్రాడు.

"ఇంకెంతో లేదు బాబూ, దగ్గిరికి వచ్చేశాం. అదుగదుగో, ఆ కనిపించే మేడలే ఢిల్లీపట్నం" అంటూ ముసలమ్మ మరింత ఉత్సాహంతో గబగబా నడుస్తోంది.

ఆ సమూహంలో ఏమూలనుంచో సంభాషణ వినిపిస్తోంది. ముసలమ్మ వాళ్లంతా చెవులు చేసుకుని వింటోంది.

"చంపితే తిరిగి చంపద్దు అంటాడు. ఇళ్ళూ వాకిళ్ళూ తగలబెట్టి బైటికి తరిమినా బదులుకు బదులు తీర్చుకోకూడదంటాడు. తన కేం పోయింది? ఒడ్డున నిలబడ్డవాడు ఎన్ని కబుర్లయినా చెప్పొచ్చు"

"ఆయనమాటలు వినటంవల్లనే ఇంత అధోగతి పట్టింది మనకు. కత్తికి కత్తితోనే బదులు చెప్పాలి. రక్తానికి రక్తమే తగిన జవాబు. ఈ వెర్రివేదాంతాలు విని విని విసిగిపోయాం. మన కడుపుమంట ఆయన కేం తెలుసు?"

"తన కళ్ళముందు తన పెళ్ళాంబిడ్డల్ని పరాభవించి ప్రాణాలు తీస్తుంటే తను చూస్తూ వూరుకోగలడా? తనదాకా వస్తేకాని తెలియదు!"

ఈమాటలన్నీ విని ముసలమ్మ మండిపోయింది. బదులుకు బదులు పనికిరాదని చెప్పే మనిషిపేరు విన్నప్పుడల్లా ఆమెకు పట్టలేని అక్కసు వస్తుంది. తనకు జరిగినంతటి దురన్యాయం జరిగినా ప్రతీకారం లేకుండా దీనంగా భరించి ఊరుకోవలసిందేనా? తన శోకగాథను ఆయనకు వినిపించి నాకు దారి ఏమిటని అడిగితే ఏం చెబుతాడు? అసలు ఆయనమూలంగానే తనకు ఇన్ని అగచాట్లు దాపరించినై. ఆయనమూలంగానే శత్రువులు నానాటికీ చెలరేగిపోతున్నారు. ఆయన ఎంతసేపూ చచ్చేవాళ్లను చావమని చెప్పటమేగాని చంపేవాళ్ళను ఆపలేడు. ఆయన చెప్పేదంతా అబద్ధం. కత్తికి కత్తితోనే బదులుచెప్పాలి- అనుకుంటూ ముసలమ్మ మనమడికేసి చూసింది. వాడు అర్థంకాకపోయినా మాటలన్నీ వింటూ తలవూపుతున్నాడు. పిడికిలి బిగబట్టి "మామ్మా! వాళ్లను ఒక్క గుద్దుకు చంపేస్తాను" అని తన పరాక్రమాన్ని ప్రకటించాడు. ఈమాటలు విని తన తపస్సంతా ఫలించినట్లుగా ముసలమ్మ మురిసిపోయింది. తన బడలిక అంతా ఒక్కసారి ఎగిరిపోయినట్లనిపించింది. ఢిల్లీలో వెళ్లి వాలాలి. కాని ఇల్లూ వాకిలీ అన్నీ వదిలివచ్చిన తమకు అండ ఎవరు? గూటిని విడిచిన పక్షుల్లాగా అల్లాడే తమకు దిక్కెవరు? ఇక తమకు దినం ఎల్లా వెళుతుంది? తమకు బతుకుతెరు వేది? తమకు తలదాచుకునే నీడ ఏది? ఎన్నో ప్రశ్నలు ముసురుకుని మనసును చికాకుపరుస్తున్నయ్. ముసలమ్మమాత్రం భారం అంతా దైవంమీద వేసింది. నారుపోసినవాడు నీరుపోయడా? కానిదేశం వచ్చాం. ఉన్నదంతా వొదులుకుని ఉత్తచేతుల్తో వచ్చాం. మమ్మల్ని కనికరించడా? మమ్మల్ని కాపాడడా? అని అనాథనాథునికి విన్నపం చేసుకుంటోంది. మనస్సు ఢిల్లీ చేరటంకోసం తహతహలాడిపోతోంది. ఢిల్లీలో అడుగుపెట్టగానే వొళ్లు ఝల్లుమంది. దారిలో హతమైపోయిన పిల్లలు తలపుకు వచ్చి ముసలమ్మగుండె జలదరించింది. ఆ దుఃఖంలోంచి ఆవేశం పొంగుకువచ్చింది. ప్రతీకారంకోసం ఆమె ఆత్మ ఘోషించింది. కాదనేవా రెవరో, వద్దనేవా రెవరో చూస్తాను. వారికి నాకథ వినిపిస్తాను.పోరాడుతాను—అనే ఆవేశంతో కంపించింది.

అందుకోసమే ఆనాటి సాయంకాలమే తన మనమడిని ఎత్తుకొని, మట్టికొట్టుకొని పేలికలైపోయిన గుడ్డలతో, అన్నంకోసం అలమటించే ప్రాణంతో సూటిగా ప్రార్థన సమావేశంజరిగే చోటికి పోయింది. ఆయనకు తనకథ అంతా చెప్పి ఆయనతో పోట్లాడితన కడుపుమంట ఆయనకు తెలియజెప్పుకోవాలి అనుకొంటూఅక్కడికివచ్చింది.

ఆమె అక్కడికి చేరేసరికే ఎందరో అక్కడ గుమికూడారు. అందరూ ఆయన రాకకోసమే ఎదురుచూస్తూ కూచున్నారు. ఇంకా రాలేదేం? ఇవాళ ఎందుకు ఆలస్యం అయింది? అనేప్రశ్నలు అందరి మనసుల్లోనూ సందడి చేస్తున్నయ్. ఆకాశపథంలో నిత్యయాత్రికుడైన సూర్యుడి గమనమైనా ఒక నిమిషం అటూ ఇటూ కావచ్చునుగాని ఆయన కార్యకలాపాలు మాత్రం క్షణం కూడా ఆలస్యంకావటానికి వీలులేదు. అటు

వంటి మనిషి ఇవాళ ఎందుకు వేళతప్పాడు? అన్ని కార్యక్రమాలలోనూ అతిముఖ్యంగా పాటించే ప్రార్థనకు ఎందుకు ఆలస్యంగా వస్తున్నాడు? నిమిషం, రెండునిమిషాలు, ఇప్పటికి ఐదునిమిషాలు అయిపోయింది. ఇంకా ఆయనజాడ కనిపించటం లేదు. కారణం ఏమిటో? ఏమైనా ప్రమాదం సంభవించలేదుకదా? లేకపోతే ఇంత ఆలస్యం కావటం అసంభవం—అనే అలజడి ఒక హృదయంలోనుంచి ఇంకో హృదయానికి పాకిపోతోంది. అక్కడ కూడినవాళ్ళందరూ ఆయనరాకకోసం, ఆయనదర్శనభాగ్యం కోసం ఆయన అమరవాణిని చెవులారా వినే అదృష్టం కోసం తహ తహలాడుతూ చీమ చిటుక్కు మన్నా ఉలిక్కిపడుతున్నారు. ఆయనఅడుగుల అలికిడికోసం వాళ్ళంతా చెవులుచేసుకుని కూచున్నారు. ఆ జనసమూహంలో కలిసిపోయి ముసలమ్మ తోసుకుంటూ ముందుకుపోయి వేదికదగ్గిరగా చతికిలపడింది. ఆయన ఎప్పుడు వస్తాడా, ఆయనకు తన వ్యథ అంతా ఎప్పుడు వినిపిద్దామా, ఆయనతో ఎప్పుడు వాదన చేద్దామా అని ఆమెమనసు ఆరాటపడిపోతోంది. శత్రువుతో తలపడి హోరాహోరి యుద్ధంచెయ్యటానికి ఉవ్విళ్లూరే సైనికుడిలాగా ముసలమ్మమనసు ఎప్పుడా ఎప్పుడాఅని ఎదురుచూస్తోంది. తన ఆర్తికంతటికీ, తన అభాగ్యానికంతటికీ మూలకారణం ఈ వ్యక్తే అనిపిస్తోంది. ఆయనమీద కసితో విరుచుకుపడటంకోసం దెబ్బతిన్నతాచులాగా ముసలమ్మగుండెల్లో ఆవేశం, ఆక్రోశంబుసలుకొడుతున్నయ్.

ఇంతలో గుంపులో కలకలం బయలుదేరింది. బాపూజీకి జై అనే కేకలు చెలరేగినై. ముసలమ్మ ఒక్కసారిగా లేచి నిలబడింది. ఏమీ కనబడలేదు. ఆత్రంగా అన్నివైపులా చూపులు పరిగెత్తించింది. దూరాన వడివడిగా నడిచివస్తున్న వృద్ధమూర్తి ఆమెకు కనిపించాడు. ఎవరో ఇద్దరి బుజాలమీద చేతులుమోపుచేసుకున్నాడు. చురచురలాడుతున్న ఎండ తాకకుండా తెల్లటిముసుగు కప్పుకున్నాడు. దూరంనుంచి ఎండవెలుతురు పడి కళ్ళజోడు మెరుపురేఖలాగా తళుక్కుమన్నది. వయసువల్ల ముసలమ్మచూపు మందగించింది. ఎంత ప్రయత్నించినా ఇంకేమీ కనిపించలేదు. అల్లాగే నిలబడి చూస్తోంది.

ఆయన క్షణక్షణమూ ప్రార్థనస్థలానికి దగ్గరదగ్గరగా వచ్చేస్తున్నారు. క్షణక్షణానికీ ఆయనరూపం మరింత స్పష్టంగా కనబడుతోంది. బుజాలమీద చేతులు వేసిన అమ్మాయితో ఏవో నవ్వుతూ మాట్లాడుతున్నారు. ఆమాటలు వినబడటం లేదుకాని అపూర్వమైన ఆ చిరునవ్వులుమాత్రంచూసేవాళ్ల మనస్సులను వెన్నెలవెల్లువలతో ముంచెత్తుతున్నయ్. ఆయన ఆకారంలో ఎంతో అలసటా, బడలికా కనిపిస్తున్నయ్. కాని ఆ అద్భుతమందహాస మాధుర్యంలో అవన్నీ కొట్టుకుపోతున్నయ్. ముసలమ్మచెవుల్లో ఆయనఅడుగుల అలికిడి వినిపిస్తోంది. ఆమెకళ్లు ఆయనతేజోమయమూర్తిని చూస్తూ రెప్పవాల్చటం మరిచిపోయినయ్. ఆమెమనసు ఒక్కసారిగా తన అక్కసునంతటినీ మరిచిపోయి ఆశ్చర్యంలో

మునిగిపోయింది. ఈవయస్సుమళ్ళిన ముదుసలి, ఈ వెన్నెలనవ్వుల పసిపాప ఈయనా తన శత్రువు? ఇన్నాళ్ళనుంచీ తను విన్న మాటలన్నీ నిజమేనా? జాలితొణికే ఆ చూపులు ఎవరికైనా హానితలపెట్టగలవా? ఇంతటిదురంతాలకూ, ఇన్ని దారుణమారణాలకూ ఈకరుణామూర్తి కారణమా? నిజమా? నిజమా? అనుకుంటూ ముసలమ్మ మనమడికేసి చూసింది. అప్పటికే మనమడు ఎవరూ చెప్పకుండానే తనంతట తానే బాపూజీకి చెయ్యెత్తి నమస్కారం చేస్తున్నాడు. ముసలమ్మ చకితురాలైపోయింది. ఏమిటి ఈ వ్యక్తిలోని శక్తి? పగపట్టిన తాచుపాము కూడా ఆయనముందుకు వచ్చేసరికి కోరలూడిపోయి పడగ లేవదు కాబోలు? ఇన్నాళ్లనుంచీ తన మనసులో పేరుకుపోయిన పగ అంతా ఒక్కనిమిషంలో ఎక్కడికో మాయమైపోయింది. ఈయనలో ఏం ఇంద్రజాలముందో? అయినా ఆరని చిచ్చుతో రగిలే తన గుండెలు ఒక్కసారిగా ఎల్లా చల్లారుతయ్? తన సంతానమంతా గురియైన చిత్రవధలు ఎల్లా మరచిపోగలదు? ఆ పైశాచికదృశ్యాలన్నీ ఒక్కసారిగా కళ్లముందు నుంచి దూసుకుపోయినై. ముసలమ్మ కళ్లు తెరిచివున్నా వాటికి ఏమీ కనబడటంలేదు. తన బిడ్డల హాహాకారాలు ఒక్కసారిగా చెవుల్లో గింగురుమన్నయి. ఆమె ప్రతిరక్తనాళంలోనూ రణదుందుభులు మోగుతున్నయ్. కాని మళ్ళీ ఒకసారి బాపూజీకేసి చూసింది. ఆయన చాలాదగ్గరికి వచ్చేశారు. పసిపాపల బోసినవ్వూ, పరమఋషుల తేజస్సూ, కరుణకురిసే జాలిచూపూ ఒక్కసారిగా ముసలమ్మను మంత్రముగ్ధురాలిని చేసినై. అడుగు కదపలేక కళ్లు అప్పగించి చూస్తూ నిలబడిపోయింది.

ఇంతలో "హా రాం, హా రాం" అన్న దీనమైన ఆర్తధ్వనులు వినిపించినై. జనంలో ఒక్కసారిగా హాహాకారాలు చెలరేగినై. ఆ రక్తప్రవాహం చూసి ముసలమ్మ కళ్లు గిర్రున తిరిగిపోయినై. బాపూజీ నేలకు ఒరిగిపోయారు. వక్షస్థలం రుధిరవార్ధులను ఎగజిమ్ముతోంది. బాధతో మూతలుపడుతున్న కళ్లలో అక్షయమైన క్షమ ధగధగ వెలుగుతోంది. తుత్తునియలైపోయి నెత్తురు కాలువలు కడుతున్న ఆ అజాతశత్రువుగుండెలకేసి చూస్తుంటే ముసలమ్మతల తిరిగిపోతోంది. తను దారిపొడుగునా చూసిన చిత్రవధలన్నీ ఒక్కసారిగా మరుపుతెరలలో మాయమైనయ్. తన కూతురు మానభంగానికి మగ్గిపోయి మరణించిన క్షణంలోకూడా గుండె అంత బద్దలైపోలేదు. తనకొడుకూ, అల్లుడూ చిత్రవధకు గురియై ప్రాణాలు విడిచిన క్షణంలోకూడా అంత ఆక్రోశంతో గొంతుచించుకొని శోకించలేదు. కాని ఈ క్షణంలో ముసలమ్మమనసు పరవడితొక్కే శోకసాగరం. ఈక్షణంలో నెత్తురుధారలతో తడిసిపోతున్న బాపూజీమూర్తిలో సంతానాన్ని కోలుపోయిన తల్లిదండ్రులూ, భార్యలను పోగొట్టుకున్న భర్తలూ, భర్తలనుకోలుపోయిన భార్యలూ శోకించే అభాగ్యలోకం అంతా ఒక్కసారిగా కానవచ్చింది. చూడలేక కళ్ళుమూసుకుంది. కళ్ళుమూసినా వరదలైపారుతున్న ఆ పవిత్రరక్తమే! అనాథులకు, ఆర్తులకు, అగతికులకు

అండగా నిలిచిన అజాతశత్రువు అపూర్వ సమర్పణ ఆ రక్తమే! తరతరాల రక్త దాహంతో హాహాకారాలు చేసే హృదయాలకు అమృతవర్షం ఆ రక్తమే!

మరొకసారి ధైర్యం తెచ్చుకుని కళ్లు తెరిచి చూసింది. మహానదిలో కలిసిపోయే ఉపనదులలాగా తన కొడుకూ, కోడలూ, కూతురూ, అల్లుడూ కరుకుకత్తులకు గురియై చిందించిన వేడినెత్తురు కూడా ఆ రక్త వారిధిలో పొంగులెత్తుతున్నట్లనిపించింది ...

"మామ్మా! బాపూజీని చంపేశారు..."

"అవును బాబూ! ఇంక మనకు దిక్కెవరు?" అంటూ స్పృహతప్పి వెనక్కు విరుచుకుపడిపోయింది.